క్లుప్తంగా

ఉచిత వైద్య సేవలు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని ఖమ్మం చర్చి కాంపౌండ్‌లో గల పార్కులో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత వైద్య సేవలను గురువారం సంస్థ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖమ్మంతో పాటు సింగరేణి మండలం కోమట్లగూడెం గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు హరినాథబాబు, నరసింహారావు, నర్సు బిందు, సంస్థ కార్యనిర్వాహణ అధికారి గుదిమళ్ల సూర్యప్రకాశరావు, రాష్ట్ర పరిశీలకులు సాధినేని జనార్దన్‌రావు, సభ్యులు గజేంద్రుల నాగేశ్వరావు, జిల్లా వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో..



వైద్య శిబిరంలో పాల్గొన్న జిల్లా జడ్జి, తదితరులు

ఖమ్మం లీగల్: నగరంలోని జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో గురువారం ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన హైదరాబాద్ కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, ఉపాధ్యక్షుడు మాదిరాజు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి బసవయ్య, ఎం.జె ప్రవీణ్‌కుమార్, వైద్యులు అరుణ్‌కుమార్, శ్రావణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షీని కలిసిన వీవీసీ అధినేత



దీపాదాస్ మున్షీతో వీవీసీ రాజా

ఖమ్మంఅర్బన్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని గురువారం వీవీసీ గ్రూప్ అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా)మర్యాదపూర్వకంగా కలిశారు.ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ టికెట్‌ను ఆశిస్తున్న వ్యాపారవేత్తగా ఆమె కలిసి జిల్లాలో రాజకీయాల తదితర వాటిపై కొద్దిసేపు ముచ్చటించినట్లు రాజా తెలిపారు.

సన్మానం..



హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న నివాసులు

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక డబుల్ బెడ్ రూం నివాసులు తాజా మాజీ సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సముదాయం వద్ద నెలకొన్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా వాటన్నింటిని గ్రామ పెద్దలతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హరిప్రసాద్ హామీ ఇచ్చారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరుకారం
వినోద	అంబాజీపేట మ్యారేజి బ్యాండ్
సాయిరాం	యాత్ర 2
ఆదిత్య	లాల్ సలామ్
శ్రీనివాస	ఈగల్
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	28	బచ్చలికూర	3
వంకాయ	26		20
బెండకాయ	50	పాలకూర	3
పచ్చిమిర్చి	26		20
కాకర	60	చుక్కకూర	3
బీర	50		20
దొండ	44	తోటకూర	2
పొట్లకాయ	48		10
చిక్కుడు	90	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	26	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం



వసూళ్లపై వర్రీ..!

కేఎంసీ ఆదాయంపై దృష్టి సారించని యంత్రాంగం

- ఏటా రావాల్సిన ఆదాయం రూ.80 కోట్లు.. వసూళ్లవుతున్నవి రూ.60 కోట్లలోపే..
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు వచ్చినవి రూ.48.69 కోట్లు
- 2022-23లో వసూళ్లయినవి రూ.79.59 కోట్లు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఒకటిగా నిలుస్తుంది. ఖమ్మం నగరం విస్తరిస్తుండడంతో ఇక్కడ వ్యాపారాలు భారీగా పెరుగుతున్న నేపథ్యాన కేఎంసీకి ఆదాయం భారీగానే రావాల్సి ఉంది. కానీ అధికారుల తీరుతో కార్పొరేషన్‌కు ఆశించిన స్థాయిలో ఆదాయం లభించడం లేదు. ఇక సొంత నిధులు రాబట్టడంలో యంత్రాంగం విఫలమవుతున్నదన్న విమర్శలు ఉన్నాయి.

ప్రభుత్వ నిధులపైనే ఆశలు..

సంవత్సరానికి రూ.80 కోట్లకు పైగా సొంత నిధులే ఆదాయంగా సమకూరనుండగా.. కేవలం రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు రాబడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులపైనే ఎక్కువగా ఆశలు పెట్టుకుంటున్నారు. 2022-23 ఏడాదిలో వివిధ మార్గాల్లో కేఎంసీకి రూ.79.59 కోట్లు ఆదాయం వచ్చినట్లు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. ఇక ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.48.69 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. గతేడాది నగరంలో ఉత్పత్తి అయ్యే చికెన్ వేస్ట్ ద్వారా రూ.42 లక్షలు సాధించగా.. ఈ ఏడాది వేలం పాటలో రూ.కోటికి ఓ కాంట్రాక్టర్ దక్కించుకుని నేటికీ అందుకు సంబంధించిన నిధులను కేఎంసీకి చెల్లించలేదు.

వసూళ్లలో జాప్యం..

కేఎంసీకి లభించే ఆదాయ వనరుల్లో ప్రధానమైనది పన్నుల వసూళ్లు. వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేస్తే కేఎంసీకి రూ.30 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. 2022-23 ఏడాదిలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక చొరవతో కేఎంసీకి తొలిసారి రూ.26 కోట్ల ఆదాయం ఆస్తి పన్నుల ద్వారానే లభించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.29 కోట్లు రాబట్టాలని లక్ష్యాన్ని నిర్దేశించుకోగా.. ఇప్పటి వరకు రూ.16.15 కోట్లు మాత్రమే వచ్చింది. ఇలా పంపు పన్నులు, ట్రేడ్ లైసెన్సుల ఫీజులు, అద్దెలు వసూలు చేయడంలో కూడా సిబ్బంది అలసత్వం వహిస్తున్నారు. కమిషనర్ ఆదేశించినప్పుడే ట్రేడ్ లైసెన్సులపై హడావిడి చేసే సిబ్బంది తర్వాత పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి.

రెండేళ్లలో వచ్చిన ఆదాయ వివరాలిలా (కోట్లల్లో)..

వనరులు	2022-23	2023-24
ఆస్తి పన్ను	26	16.15
ట్రేడ్ లైసెన్స్ ఫీజ్	0.82	0.55
చికెన్ వేస్ట్	0.42	--
అద్దెలు	0.60	0.25
మ్యుటేషన్ ఫీజ్	0.75	0.06
టౌన్ ప్లానింగ్	30	23.75
వాటర్ సప్లయి	2	0.99
పట్టణ ప్రగతి	10	3.90
అమృత్ పథకం	5.50	2.50
మార్కెట్ల అభివృద్ధి	3.5	--

ఖర్చులు భారీగానే..

కేఎంసీకి వచ్చే ఆదాయంలో ఖర్చులు భారీగానే ఉన్నాయి. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వ నిధులు, ఎల్‌ఆర్‌ఎస్, ఎస్‌డీఎఫ్, సుడా నిధులను వినియోగిస్తుండడంతో కేఎంసీకి కొంత ఊరట లభిస్తుంది. ఇక కేఎంసీకి ఏటా రూ.55 కోట్లకు పైగా ఖర్చులు ఉంటున్నాయి. వాటిల్లో ప్రధానంగా ఉద్యోగుల వేతనాలకు రూ.25 కోట్లు, విద్యుత్ బిల్లులు రూ.12 కోట్లు, డీజిల్, పెట్రోల్ ఖర్చు రూ.4 కోట్లు, ఓఏ కింద రూ.6 కోట్లు, హరితహారం కింద రూ.8 కోట్లు ఖర్చు అవుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటితో పాటు మరో రూ.10 కోట్లు వరకు అదనపు ఖర్చులు ఉంటున్నట్లు తెలుస్తోంది.

రైతు రుణమాఫీపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, బడ్జెట్ సమావేశాల్లో రైతాంగ రుణమాఫీకి సంబంధించి కార్యాచరణ ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు అన్నారు. గురువారం స్థానిక గిరిప్రసాద్ భవనంలో సంఘ జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేశ్ అధ్యక్షతన జరిగిన సంఘ సమావేశంలో గోవిందరావు మాట్లాడారు. యావత్ తెలంగాణ రాష్ట్ర రైతాంగం రుణమాఫీ కోసం ఎదురు చూస్తుందని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీపై ఎన్నో ఆశలు చూపి రైతులను వంచించడంతో నూతన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెంచుకున్నారని తెలిపారు. సాగర్ ఎడమ కాల్వ ద్వారా ఖమ్మం జిల్లాలోని చెరువులు, కుంటలను నింపాలని రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బాగం ప్రసాద్, తాతా వెంకటేశ్వర్లు, సిరిపురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



భాను బి.శరత్

తిరుమలాయపాలెం: జాతీయ క్రీడా పోటీల్లో మండలంలోని మహ్మదాపురం పరిధిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. గత నెలలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో అండర్ 14 విభాగంలో నిర్వహించిన పోటీల్లో శరత్(కబడ్డీ), భాను(ఖోఖో) ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా గురువారం ఇద్దరు విద్యార్థులతో పాటు పీడీ లక్ష్మణ్‌ను ప్రిన్సిపాల్ పుల్లయ్య సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుకుల స్పోర్ట్స్ ఆఫీసర్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ రూత్ మార్క్స్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వీణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు యువ కుటుంబాలను దూరం చేయొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నూతన రేషన్ కార్డులను ఇవ్వలేదని, రేషన్ కార్డుల ఆధారంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తే ఖమ్మం జిల్లాలోనే దాదాపు 80 వేల యువ కుటుంబాలు సంక్షేమానికి దూరమయ్యే ప్రమాదం ఉందని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేసే ముందు అర్హులైన వారికి రేషన్ కార్డులను జారీ చేయాలన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాలు సాగవుతుందని ఈ ఏడాది యాసంగి సాగు చేయలేదన్నారు. కానీ అక్కడక్కడ సాగు చేసిన పంటలను కాపాడడంతో పాటు వేసవి నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని చెరువులు, కుంటలు నింపాలన్నారు. మిషన్ భగీరథకు సంబంధించి తాగు నీటిని అందించే పాలేరు, వైరా, లంకాసాగర్ తదితర మీడియం ప్రాజెక్టులను నింపాలని ప్రసాద్ డిమాండ్ చేశారు.

సీఎస్‌సీ నిర్వాహకుడి అధిక వసూళ్లు..



విచారణ చేస్తున్న గిర్దావర్ సక్రు

కామేపల్లి: ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ఓ సీఎస్‌సీ నిర్వాహకుడు అందినకాడికి దోచుకోవడంతో స్థానికులు అతడిని నిలదీయడంతో పాటు తహసీల్దార్ సుధాకర్‌కు సమాచారం అందించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కామేపల్లి సీఎస్‌సీ డిజిటల్ సేవ కామన్ సర్వీసెస్ సెంటర్ నిర్వాహకుడు సతీశ్ కొత్త ఆధార్ కార్డు నమోదు, చేర్పులు, మార్పులు, వేలిముద్రల అప్‌డేట్ వంటి పనులకు సంబంధించి అసలు రుసుం కంటే అదనంగా రూ.300 నుంచి రూ.500 వరకు వసూళ్లు చేస్తున్నాడు. ఈక్రమంలో గురువారం స్థానికులు కనీసం పనులకు సంబంధించిన ధరల పట్టిక లేకుండా ఇష్టం వచ్చినట్లు కేంద్రం నిర్వహిస్తున్నారని తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో తహసీల్దార్ సూచన మేరకు గిర్దావర్ సక్రు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించాక కేంద్రానికి సంబంధించిన అనుమతి పత్రాలను తీసుకుని తహసీల్‌కు రావాలని నిర్వాహకుడిని ఆదేశించారు. ఈ విషయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వామపక్ష నాయకులు

తిరుమలాయపాలెం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష సంఘాల నాయకుల పిలుపునిచ్చారు. గురువారం ఈమేరకు సమ్మెకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకుల మాట్లాడుతూ.. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దుచేసి రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చిందని, వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలకు బడ్జెట్‌లో నిధులు అరకొర కేటాయింపులు చేసి నిర్వీర్యం చేసిందని, అధిక ధరలను అదుపు చేయలేకపోయిందని అన్నారు. బీజేపీని రాబోయే ఎన్నికల్లో ఇంటికి పంపాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ము శ్రీను, కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హన్మంతరావు, చీమ రామకృష్ణ, గొర్రెపాటి రమేష్, సోమనపల్లి వెంకటేశ్వర్లు, యడ్లపల్లి నవీన్ ఆరెంపుల వెంకన్న, కొత్తపల్లి శివయ్య, మీగడ సత్యం తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం సొసైటీలో అక్రమాలు?

రఘునాథపాలెం: రఘునాథపాలెం సహకార సంఘంలో అక్రమాలు జరిగాయాయంటూ గురువారం సోషల్ మీడియాలో ప్రచారం వైరల్‌గా మారింది. సంఘంలో 1,200 మంది రైతులు సొసైటీ సభ్యులుగా ఉండగా.. గతంలో హెల్త్ కార్డులు కోసం రైతుల నుంచి రూ.1,000 తీసుకుని ఒక్కరూ సీస్టార్ ఆస్పత్రికి వెళ్లలేదని, రుణమాఫీ విషయంలో కూడా తప్పిదాలు ఉన్నాయని, నూతనంగా నిర్మించిన సొసైటీ షాపింగ్ కాంప్లెక్స్‌కు సంఘం నుంచి వాడుకున్న డబ్బులకు లెక్కలేవని, షటర్స్ కూడా వాళ్లు అనుకున్న వారికే ఇచ్చారని కొందరు వాట్సాప్ గ్రూప్‌ల్లో పోస్టు చేశారు. ఈ విషయంపై సంఘం చైర్మన్ తాతా రఘురాంను వివరణ కోరగా.. కావాలని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, షాపింగ్ కాంప్లెక్స్ నిధులు కూడా బహిరంగానే వేలం నిర్వహించామన్నారు. ఎలాంటి విచారణ చేసుకున్నా తనకేమీ అభ్యంతరం లేదన్నారు.

వన దేవతలకు ప్రత్యేక పూజలు



వన దేవతలకు పూజలు చేస్తున్న భక్తులు



వనదేవతల దగ్గరకు సిద్ధమవుతున్న దేవుడమ్మ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కాల్వొడ్డు మున్నేరు నది పక్కన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానం వద్ద వన దేవతలు సమ్మక్క, సారలమ్మలకు జాతర మహోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి ఉప్పిసాయి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ జాతరలో భక్తులు వన దేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఫణీంద్ర సహకారంతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాదు రమేష్‌రెడ్డి, నాళం సతీశ్, పోలూరి రమేశ్, జానీమియా, శబరి స్వామి చౌదరి, ఓరుగంటి లైలా, బాబు చౌదరి, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

మంద్రాజుపల్లిలో..

నేలకొండపల్లి: మండలంలోని మంద్రాజుపల్లిలో సమక్క,సారక్క జాతర వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దేవుడమ్మ ఆధ్వర్యాన వన దేవతలను డప్పు, వాయిద్యాలు, నృత్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో నిర్వహకులు రచ్చా లక్ష్మి, రాంబాబు పాల్గొన్నారు.

మళ్లీ మోదీనే ప్రధాని..

ఖమ్మం మామిళ్లగూడెం: మళ్లీ దేశ ప్రధానిగా నరేంద్ర మోదీనే మూడవసారి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ అన్నారు. గురువారం 258బూత్‌లో చలో బస్తీ కరపత్రాలను ఇంటింటికి అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరాలన్నదే బీజేపీ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, నాయకులు దీప, బండారు శ్రీనివాసరావు, పాపనినాగ, మారుతి, శేషఫనికుమార్, దీకొండశ్యామ్ రాజు, సర్వేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ జిల్లా కౌన్సిల్

ఖమ్మంమయూరిసెంటర్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఖమ్మం జిల్లా సమితి సమావేశం ఈ నెల 10న శనివారం ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని గిరిప్రసాద్ భవనంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సమకాలీన రాజకీయాలు, పార్టీ కార్యాచరణ, ప్రజా సంఘాల నిర్మాణం తదితర అంశాలపై చర్చించబడుతుందన్నారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు తదితరులు పాల్గొంటారన్నారు.

కూలీకి పాముకాటు

నేలకొండపల్లి: పొలంలో యూరియా చల్లుతున్న కూలీని పాము కాటేసింది. మండలంలోని తిరుమలాపురానికి చెందిన బి.భాస్కర్ (35) గురువారం బోదులబండలోని ఓ రైతు పొలంలో యూరియా చలుతున్నాడు. ఈక్రమంలో ఆయన కాలిపై పాము కాటేయగా, స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ తాతా వ్యాఖ్యలు గర్హనీయం

నేలకొండపల్లి: ఎమ్మెల్సీ తాతా మధు కాంగ్రెస్ నాయకులపై చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, షాడో ఎమ్మెల్యేలు కలిసి అక్రమ కేసులు పెట్టినప్పుడు ఏం చేశావని ప్రశ్నించారు. దేవాలయాల భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టి విక్రయిస్తే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు పెడితే కాంగ్రెస్‌కు ఏం సంబంధం అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోకపోతే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తు ఊరుకోరని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, జెర్రిపోతుల అంజిని, యడవల్లి నాగరాజు, బోయిన వేణు, యాతాకుల శ్రీనాథ్, వంగూరి బాలాజీ, పెద్దపాక ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వెంపటి వీరన్న(48) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈమేరకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, నాయకులు చెరుకుపల్లి భాస్కర్ తదితరులు వీరన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నియామకం



వెంకన్న

ఖమ్మం మామిళ్లగూడెం: వడ్డెర సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పల్లపు వెంకన్న నియమితులయ్యారు. గురువారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బత్తుల వీరబాబు, గౌరవ అధ్యక్షుడు రాయల సీతయ్య, ప్రధాన కార్యదర్శి కుంచపు వెంకటేశ్వర్లు నియామకపత్రాన్ని వెంకన్నకు అందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు దేరంగుల బ్రహ్మం, సోమరాజు, బత్తుల నాగేశ్వరావు, తమ్మిశెట్టి వెంకటనారాయణ, పరుశురాం, తిరుమలరావు,రాము, రవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు 'మంచికంటి'



మంచికంటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలకు, కమ్యూనిస్టులందరికీ మంచికంటి రామకిషన్‌రావు ఆదర్శప్రాయుడని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్ర శ్రీకాంత్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన రాంకిషన్‌రావు 29వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. తొలుత మంచికంటి చిత్రపటానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈనేపథ్యాన స్థానిక మంత్రివర్యులు, కలెక్టర్, అన్ని రాజకీయ పార్టీల నేతలు కొత్త బస్టాండ్ సెంటర్‌లో బైపాస్ రోడ్డుపై మంచికంటి విగ్రహ ప్రతిష్ఠకు మద్దతు పలకాలని కోరారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేశ్, వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు వాసిరెడ్డి వరప్రసాద్, ఆర్.ప్రకాశ్, షేక్.బషీరుద్దీన్‌లతో పాటు బోడపట్ల సుదర్శన్, జాన్, రామారావు, అఫ్జల్, పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

కామేపల్లి: నులి పురుగుల నివారణకు 1 నుంచి 19 ఏళ్ల లోపు కలిగిన ప్రతీ ఒక్కరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఎంపీడీఓ విజయ్‌భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చందన ఆధ్వర్యాన ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం కార్యక్రమంపై మండల టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 19 ఏళ్ల లోపు ఉన్న 7,500 మంది పిల్లలకు తప్పకుండా మాత్రలు వేయించాలన్నారు. ఏఈ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, సూపర్‌వైజర్ పార్వతీ, హెచ్‌ఈఓ దూప్‌సింగ్ తదితరులున్నారు.

ఆలయానికి విరాళాలు



విరాళం అందిస్తున్న దాతలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్ రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునర్నిర్మాణానికి గురువారం దాతలు విరాళాలు సమర్పించారు. నగరంలోని ద్వారకానగర్‌కు చెందిన గ్రానైట్స్ యజమాని కోయ సత్యమోహన్-పద్మజ దంపతులు రూ.11,116లు, గ్రానైట్ అధినేత ఎస్.వెంకటేశ్వర్లు-శ్రీదేవి దంపతులు రూ.10వేలను ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నేలకొండపల్లి: మండలంలోని అమ్మగూడెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు పసుపులేటి రామారావు ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యాన స్థానిక గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన గురువారం దశ, దిన కర్మకు రూ.10,016ల నగదును కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ నాయకులు నెల్లూరి భద్రయ్య, మెన్నపూసల సీతారాములు, అడపాల రామారావు, సత్యం, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి దోహదం



ఐక్వస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ శ్రీవిద్య, ఏసీపీ సుశీల్‌సింగ్ చౌహాన్

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల ఉన్నతికి ఐక్వస్ట్ కార్యక్రమం దోహదపడుతుందని హెడ్ క్వార్టర్స్ ఏసీపీ సుశీల్‌సింగ్ చౌహాన్, శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్యలు అన్నారు. గురువారం స్థానిక మమత ఆస్పత్రి రోడ్‌లోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ పాఠశాలలో జోనల్ వారిగా జరిగిన ఐక్వస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఆరు విభాగాలుగా విభజించి వివిధ రంగాల్లో నిష్ణాతులైన విద్యార్థులను వారి పాఠశాలల్లో ఎంపిక చేసి ఖమ్మంలో నిర్వహించిన జోనల్ లెవల్‌కు ఎంపికయ్యారన్నారు.ఐక్వస్ట్‌లో భాగంగా సృజనాత్మకత కళలైన చిత్రలేఖనం, నృత్యం, సంగీతం, మేథస్సు క్రీడా కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జోనల్ కో ఆర్డినేటర్లు లావణ్య, సౌజన్య, ఏజీఎం చేతన్ మాదూర్, ప్రిన్సిపాల్ టీఎల్‌ఎస్ శర్మ, రాజ్‌కుమార్ జోషి, ఏడుకొండలు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.